# పబ్లిక్ గార్డెన్స్

"మెత్తగా పరుచుకున్న ఈ లేత పచ్చికబయళ్ళూ, మత్తుగా గాలికి ఊగుతున్న ఆ చిన్న చిన్న పువ్వుల చెట్లూ, ఒత్తుగా అల్లుకున్న ఆ పొదరిళ్ళూ, వీటితో ఈ పబ్లిక్ గార్డెన్స్ చూడ్డానికేం, హాయిగా అందంగా ఆహ్లాదకరంగానే ఉంటాయి....కాని...." అంటూ మాట మధ్యలోనే ఆగి పోయిన రాణీకేసి అదో మాదిరిగా చూసి నవ్వుతూ "కానీ అంటూ ఏం మాట మధ్యలోనే ఆగిపోయావ్? హైద్రాబాద్ ప్రజలంతా ఓహో అని మెచ్చుకునే ఈ గార్డెన్స్ నీకు నచ్చ లేదా"అంటూ కొంటెగా అడిగాడు సుందరం.

రాణీ ఏం సమాధానం చెప్పలేదు. రాత్రి నిద్దరలేని కళ్ళలాగ, ఎర్రగా బద్ధకంగా కదులుతూన్న పక్కనున్న కొలనులోని ఎర్ర తామరల్ని కన్నార్పకుండా చూస్తూ కూర్చుంది.

"ఎప్పుడు ఈ ఊరు వచ్చినా ఏదో ఒక హడావిడి. పనులు చూసుకోవడం, సరుకులు కొనుక్కోవడం, చుట్టాల ఇళ్ళకి వెళ్ళడం, స్నేహితుల్ని పలకరించడం - పాత కబుర్లూ పరుగులు పందేలూను. అందుకే ఈ మారు మనం వస్తున్నట్లు ఎవళ్ళకీ తెలియపర్చకుండా గుప్‌చుప్‌గా వచ్చి

హోటల్లో దిగింది. ప్రాణానికి హాయిగా ఉంది. ఈ మాత్రం ఖాళీగా ఉన్నాం కనుకే ఇలా సరదాగా ఓ గంట ఇక్కడ కలుసుకున్నాం. లేకపోతే, ఇన్నిమాట్లు హైదాబాదు వచ్చాం. ఈ పబ్లిక్ గార్డెన్స్కి ఒక్కమాటు రాగలిగామా?" అన్నాడు సుందరంచేతిలో ఉన్న న్యూస్ పేపర్ని వెనక్కి మడిచి కొత్త మడత పెడుతూ.

అలలుగా కొలను మీదినుంచి వస్తూన్న చల్లని గాలికి ముంగురులు చెదిరి, నుదుటి మీద పడుతూ ఉంటే, వాటిని ఒయ్యారంగా వెనక్కి సర్దుకుంటూ సుతారంగా నవ్వింది రాణి.

"నీ మాటలూ చూపులూ చూస్తే నీకి పబ్లిక్ గార్డెన్స్ నచ్చినట్లు లేదే? ఇప్పుడింకా ఎండ బాగా ఉంది కనుక కానీ, ఇంకో గంటా రెండు గంటలు పోతేనా. ఈ ప్రదేశం అంతా కలకల్లాడుతూ ఉంటుంది. జంటలతోనూ, రకరకాల రంగురంగుల లైట్లతోనూ" అన్నాడు సుందరం - తల కింద కుడి చేతిని ఆన్చుకొని పచ్చగడ్డి మీద వాలుగా పడుకుంటూ.

శీతాకాలపు ఎండ, చెట్ల ఆకుల సందుల్లోంచి పడుతూ, శరీరానికి నులివెచ్చని హాయినిస్తూంటే, మోకాళ్ళచుట్టూ రెండు చేతుల్నీ బిగించి, సుందరం అందాన్ని కళ్ళతో తాగుతూ కూర్చుంది రాణి.

సుందరం నవ్వుతూ మళ్ళీ అడిగాడు "నీకి పబ్లిక్ గార్డెన్స్ నచ్చలేదా?" అంటూ.

"నచ్చడం అంటే.... ఆకర్షణీయంగా అందంగా బాగానే ఉందనుకోండి. కాని ఏమిటో.... మనస్సుకి ఒక రకమైన ప్రశాంతిగా హాయిగా నిర్మలంగా లేదు.... ఇక్కడ కృత్రిమమైన సౌఖ్యమే కాని సహజమైన ఆనందం ఏం ఉన్నట్లు అనిపించడంలేదు."

"భలే దానివే –చాల్లే – నీకు ఇళ్ళూ వాకిళ్ళూ నచ్చినట్లు, పార్కులూ పచ్చిక బయళ్ళూ నచ్చేటట్లు లేవే? ఊరికే పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోక హాయిగా పువ్వుల్నీ చెట్లనీ ఆ కొలనులోని తామరల్ని చూస్తూ తనివి తీరా ఆనందించు. కూర్చో—ఇప్పుడే వస్తాను. గేటు దగ్గర మొక్కజొన్న కండెలకి ఉప్పురాసి అమ్ముతున్నాడు. రెండు పట్టుకు వస్తాను" అంటూ ఆమె సమాధానం కోసమేనా ఆగకుండా, గడ్డిమీద పరచిన జేబు రుమాలూ, పక్కనే ఉన్న న్యూస్ పేపరూ తీసికుని బయలుదేరాడు సుందరం.

రాణీ చుట్టూ కలియజూసింది.

పదిగజాల దూరంలో ఉన్న ఒక మండపంలో ఇద్దరు మనుష్యులు కూర్చుని సుద్దతో గళ్ళుగీసి పులీమేకా కాబోలు ఆడుకుంటున్నారు. మండపందగ్గర స్టేండ్ వేసి ఉంచిన తుప్పపట్టి దుమ్ము కొట్టుకుపోయిన సైకిళ్ళు చూస్తేనే తెలుస్తోంది వాళ్ళెంత సోమరులో.

రాణీ తల తిప్పి ఎదురుగుండా చూసింది. కొలనుకి అవతలి గట్టున చెట్టుకింద పద్దెనిమిదేళ్ళ ఒక అందమైన అమ్మాయి కాలేజీ పుస్తకాలు కాబోలు పక్కన పెట్టుకుని, అతి ఏకాగ్రంగా ఏదో రాసుకుంటోంది. కాలేజి ఇంకా వదిలిపెట్టి ఉండరు. ఈ సమయంలో ఇక్కడికి వచ్చి ఏంరాస్తోంది చెప్మా ఈ అమ్మాయి? .. బహుశా .... ప్రేమలేఖేమో.

నవ్వుకుంది రాణీ.

సరిగ్గా ఆసమయంలో "ఐస్‌క్రీమ్' 'ఐస్‌క్రీమ్' అంటూ కేక వినిపించింది రాణీకి. చూస్తే, పదేళ్ళ కుర్రాడు-కొంచెం దూరంలో అరుస్తూ. చలాకీగా అటూ ఇటూ తిరుగుతూ, 'ఐస్‌క్రీమ్' అమ్ముతూన్నాడు. చూస్తూ ఉండగానే ఇద్దరు ముగ్గురికి 'ఐస్‌క్రీమ్' అమ్మేశాడు. వాడి చురుకూ తెలివీ చూసేసరికి రాణీకి ముచ్చటేసింది. శీతాకాలంలో ఇప్పుడు 'ఐస్‌క్రీమ్' ఏమిటి అని అనిపించినా, ఎండగా ఉందిగా అని మనస్సులో సమర్థించుకొని "ఏయ్ అబ్బాయి! ఇటురా" అని పిలిచింది రాణీ.

కేకవిని లేడిలా పరిగెత్తుకొచ్చాడు ఐస్‌క్రీమ్ కుర్రాడు.

"ఒకటి.... కాదు.... రెండియ్యి" అంటూ బేగ్‌లోంచి డబ్బు తియ్యబోతూ వాడికేసి చూసింది రాణీ.

నూనెరాయక. సంస్కారంలేక. మాగిళ్ళుకట్టి చింకిరి బింకిరిగా ఉన్న ఉంగరాల జుట్టూ-చిక్కి నీరసంగా ఉన్న

మొహంలో, తెల్లగా మెరుస్తూ కదులుతున్న రెండు నీరసించిన కళ్ళూ. చిరిగిన చొక్కా, అతుకువేసిన నిక్కరూ. చేతికి తగిలించిన ఐస్‌క్రీమ్ ఫ్లాస్కూ.

షాక్ తగిలినట్లు రాణీకళ్ళు అమట్టున ఆగిపోయాయి!

ఫ్లాస్క్ తగిలించిన ఆ కుర్రాడి చెయ్యి. మోచేతి దాకానే ఉంది. ఆ మొండిచేతికే తగిలించుకున్నాడు ఫ్లాస్క్!

"తీసుకోండమ్మా ఐస్‌క్రీమును!" అంటూ ఎడం చేత్తో ఇస్తూ వాడు హెచ్చరించే సరికి, రాణీ ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది. ఐస్‌క్రీమ్ కుర్రాడిముఖం నవ్వుతూ కనిపించింది. రాణీకళ్ళు జాలిగా వాడికేసి చూశాయి.

"అరే.... పాపం.... నీకా చెయ్యి పుట్టుకతోటే అలా ఉందా? లేక... ?"

తన చేతిలో ఐస్‌క్రీమ్‌లు ఆమెకి అందిస్తూ "ఇదాండీ ....ఇది.... ఈమధ్యనేనండీ" అన్నాడు కుర్రాడు. ఇదో పెద్ద విషయం కాదన్నట్లు తేలిగ్గా నవ్వేస్తూ.

"ఏమైంది . ఏమైందేవిటి?"

వాడు సమాధానం చెప్పేలోపుగానే దూరంగా ఏదో వేన్‌వచ్చి ఆగింది. అందులోంచి కాన్వెంటు పిల్లలు కాబోలు ఒకేరకం యునిఫారంతో బిలబిలమంటూ దిగుతున్నారు. అంతమంది పిల్లల్ని చూసేసరికి, తన ఐస్‌క్రీమ్‌లన్నీ

ఖర్చయి పోతాయనే ఆనందంతో, ఆ కుర్రాడి రెండు కళ్ళూ మెరిశాయి.

"ఇదిగో బాబూ డబ్బులుతీసుకో" అని రాణీ కేకేస్తున్నా "మళ్ళీ వస్తానుండండి" అంటూ, మొండిచేతికి ఫ్లాస్క్ తగిలించుకొని. మెరుపులా అటు పరుగుదీశాడు ఆ కుర్రాడు.

"చేతిలో కరిగి నీరై పోతూన్న ఆ ఐస్‌క్రీము లేవిటి? కొన్నావా? ఈ కాలంలో ఐస్‌క్రీము ఎందుకు? అయినా మొక్కజొన్న కండెలు తెస్తున్నానని చెప్పాను కదా?"- సుందరం కంఠం విని ఉలిక్కిపడింది రాణీ. దూరంగా కాన్వెంటు పిల్లలకి చకచకా ఐస్‌క్రీములు అమ్ముతున్న కుర్రాడి నుంచి దృష్టి మరలుస్తూ "పాపం ఎవరో చెయ్యిలేని కుర్రాడండీ-పోనీ అని కొన్నా-అవి తర్వాత తినొచ్చు. ముందీ ఐస్‌క్రీము తీసుకోండి" అంది రాణీ.

"బాగానే ఉంది. ఇలా జాలిపడి ప్రతీదీ కొంటూ పోతూంటే మన పర్సులో డబ్బులు చాలవు."

రాణీ—సుందరం మాటలో విసుగుచూసి తెల్లబోయింది.

తర్వాత ఇద్దరూ మాట్లాడలేదు.

ఎవరి ఆలోచనల్లో వాళ్ళు ఉండిపోయారు.

రాణీ ఐస్‌క్రీమ్ కుర్రాడి కేసి చూస్తూంది.

సుందరం అయితే, ఐస్‌క్రీమ్ చప్పరిస్తూ, కొలను అవతల గట్టున కూర్చుని ప్రేమలేఖ రాసుకుంటూన్న అమ్మాయినుంచి దృష్టి మరల్చుకోలేక పోతున్నాడు.

ఫ్లాస్కులో ఐస్‌క్రీములన్నీ అయిపోయి నట్టున్నాయి. పట్టలేని ఆనందంతో, యువరాజు లాగా దర్జాగా ఠీవిగా అడుగులేసుకుంటూ నెమ్మదిగా వస్తున్నాడు ఐస్‌క్రీమ్ కుర్రాడు. వాడి ముఖం నిండా చిరునవ్వులు! కళ్ళల్లో ఏదో మహత్తరమైన విజయం సాధించినట్లు కోటికోటి కాంతులు!

సమీపిస్తూన్న ఆ కుర్రాడిని చూపిస్తూ "అదిగో వాడిని చూశారా?" అంటూ ఇటు తిరిగింది రాణీ.

సుందరం తబ్బిబ్బుపడి "ఆ.... ఆ.... ఏవిటీ?" అన్నాడు. కాని అప్పటికే రాణీ కనిపెట్టేసింది.

"ఏవిటి అటు చూస్తున్నారు? ఏం వింత ఉంది చెప్మా అక్కడ! ఓహో!.... ఆ అమ్మాయా?.... హుఁ!.... మొత్తానికి మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు....వెళ్ళి పాపం పలకరించి రండి పోనీ" అన్నది కనుబొమ్మలు చిట్లించి కోపంగా చూస్తూ.

"ఏదో అటు చూస్తే ఆ అమ్మాయి కనిపించింది- అంతేకాని....ఆ అమ్మాయి ఎవరో ఏవిటో మన కెందుకు? మీ ఆడాళ్ళకి ప్రతిదీ అనుమానమే" అంటూ ఆ గడ్డిలో

వెల్లకిలా పడుకొని న్యూస్ పేపరు ముఖానికి అడ్డు పెట్టుకొని, బలవంతంగా అక్కడో లైనూ ఇక్కడో లైనూ చదవ సాగాడు సుందరం. అతనికేసి ఒక్కక్షణం తీక్షణంగాచూసి బరువుగా నిట్టూర్చి ఇటు తిరిగింది రాణీ.

ఐస్‌క్రీమ్ కుర్రాడు!

ఖాళీఫ్లాస్క్ కింద పెట్టి జేబులో డబ్బులు ఎడంచేత్తో తీసి, ఫ్లాస్క్ మూతలోపోసి సావకాశంగా బాసింపట్టువేసుకుని లెక్క పెట్టుకుంటున్నాడు.

రాణీ మొండిగా ఉన్న వాడి కుడిచేతికేసే జాలిగా చూస్తోంది. లెక్క పూర్తిచేసి డబ్బులన్నీ తిరిగి సంతృప్తిగా జేబులో వేసుకుంటూ "అమ్మగారూ! మీ దయవల్ల ఇయ్యాల ఎనిమిది రూపాయల పావలా వొచ్చిందండి" అన్నాడు వాడు.

వాడి ముఖంలో ఎంత వెలుగో!

"ఇంకా రెండు ఐస్‌క్రీములకి డబ్బులు నేను ఇవ్వాలిగా?" అంది రాణీ.

"అయి కూడా కలిపిపేసనండి" అన్నాడు కుర్రాడు.

"నీకా కొరవ కూడా ఇచ్చి పది రూపాయలు పూర్తి చేస్తాను కాని, నీకా చెయ్యి అలా ఎందుకు విరిగిందో చెప్పు" అంది రాణీ. పది రూపాయలమాట వినేసరికి వాడి కళ్ళు జిగేల్ మన్నాయి.

"ఎందుకు రాణీ వాడి చెయ్యి గొడవ - డబ్బులిచ్చి పంపించెయ్యక?" పేపరులోంచి ముఖం తియ్యకుండానే విసుగ్గా అన్నాడు సుందరం.

అతని మాటేం వినిపించుకోనట్లు "ఊ ... చెప్పరా!" అంది రాణీ. తను తినబోతున్న మొక్కజొన్న కండెసగం విరిచి వాడికి పెడుతూ.

వాడు దాన్నో మాటు ఆప్యాయంగా చూసి నిక్కరు జేబులో దాచుకొని "చెప్పడానికేం ఉందండీ? నిరుటిదాకా నా చెయ్యి బాగానే ఉందండీ" అంటూ నెమ్మదిగా మొదలు పెట్టాడు. రాణీతో బాటు సుందరం కూడా న్యూస్‌పేపరు అడ్డుగా పెట్టుకుని వాడు చెప్పేది వింటున్నాడు. కాని అతని దృష్టిని ఒక్కొక్కమాటు పేపర్లో విశేషాలూ. ఒక్కొక్క మాటు కొలను అవతల అమ్మాయీ-ఆకర్షిస్తూండడం వల్ల, మధ్య మధ్య మిస్ అవుతున్నాడు.

"నిరుటేడు కాక ఆ నిరుటేడంటి - నన్ను మా అమ్మ ఓ గొప్పోళ్ళింట్లో పనికి పెట్టిందండి-పనంటే మరేం లేదు. అయ్యగోరూ అమ్మగోరూ ఇద్దరూకూడా ఎండెక్కకుండా ఎవరి ఆఫీసులికి అళ్ళు ఎల్లి పోతారండి. ఆరెళ్ళేదాకా అమ్మ గారికి సాయం చెయ్యడం, అయ్యగారి జోళ్ళు తుడవడం. పక్కలూ అవీ ఎత్తడంలాంటి పనులన్నీ చెయ్యడం. ఆరిద్దరూ ఇల్లు తాళం ఏసుకెళ్ళాక, గుమ్మంలో కూసుని ఇల్లు చూడ్డం-ఉత్తరాలొస్తే తీసుకుని ఆ రొచ్చాక ఇయ్యడం

–ఇదండీ పని – మళ్ళీ సాయంత్రం కూడా ఏవో చిన్న చిన్న పనులుండేవండీ – ఇవన్నీ చేసినందుకు రెండు పూటలా అన్నం పెట్టి పది రూపాయలిచ్చే వారండి. నెలకోమారు వచ్చి ఆ డబ్బు మా అమ్మ పట్టి కెళ్ళేది."

ఇలా చెబుతూ చెబుతూ వాడు మధ్యలో ఆగాడు.

వేపరులోంచి ముఖం తియ్యకుండానే "వాడినింక పంపించెయ్యకూడదూ?" అంటూ విసుక్కున్నాడు సుందరం.

కాని రాణీ "చెప్పరా" అంటూ తినేసిన మొక్క జొన్న కండెని నీళ్ళలోకి విసిరేసి, సర్దుకుని కూర్చుంది.

"నేను పని బాగానే చేసేవాడినండి. కాని అమ్మగారు మాత్రం 'నువ్వు పనికి దొంగెత్తు వేస్తున్నావు. అన్నం దగ్గరున్న చురుకు, పనిదగ్గరలేదు' అంటూ కేకలేసేవారండి. అయ్యగారు మాత్రం 'వాడినేం అనకు-మన పిల్లాడి లాంటి వాడు' అనే వారు. మా అమ్మ వచ్చినప్పుడు 'వీడు సరిగా పని చెయ్యడంలేదు. వచ్చేనెల నుంచి తీసేస్తాను' అనేవారు. పని ఎక్కడ పోతుందో అని మాఅమ్మకూడా నన్నే తిట్టేదండి" ఇలా చెప్తున్నప్పుడు వాడి కంఠం బొంగురుపోయి కళ్ళల్లో నీరు తిరిగింది. వాడిని చూసేసరికి రాణీకి జాలేసింది.

సముదాయిస్తున్న ధోరణిలో "అలాగా పాపం" అంది రాణీ. ఆమెకు బాధ అనిపించింది.

ఐస్‌క్రీము కుర్రాడు తిరిగి చెప్పడం మొదలెట్టాడు.

"ఇలా కొన్నాళ్ళయి పోయిందండి. మొదట్లో బాగానే ఉండేవారు. మరి తర్వాత ఏం వచ్చిందో-అయ్యగారూ అమ్మ గారూ రోజూ అరుచుకోసాగారు. ఒకళ్ళ నొకళ్ళు కేకలేసు కుని అన్నాలు తినకుండా ఉండి పోయేవారు. నాకలాంటి రోజున భయం వేసేది. ఓ రోజున మద్దేల ఒంటి గంటకి ఎప్పుడూ లేంది అమ్మగారు ఇంటికి వచ్చారు. ఆరితో ఓ కొత్త అయ్యగారు. కూడా వచ్చారు. ఇద్దరూ ఓ గంట నవ్వుకుంటూ కబుర్లు చెప్పు కుంటూ కూచుని టీ తాగి వెళ్ళి పోయారు. ఆ తర్వాత రోజూ అలా అమ్మగారూ ఆ కొత్త అయ్యగారూ మద్దేలపేల కలిసి వచ్చి ఓ గంట కబుర్లు చెప్పు కొనేవారు. ఇవి తెమ్మనీ అవి తెమ్మనీ బజారుకి పంపించే వారు నన్ను...."

ఇలా ఆ కుర్రాండు చెప్పుకుపోతూంటే సుందరం పేపరు వెనక నుంచి వాడిని చూశాడు. చూసి చట్టున పేపరు మళ్లీ అడ్డం పెట్టుకొని వాడు చెప్పేదంతా జాగ్రత్తగా వినసాగాడు. వాడు చెబుతూన్నది వింటూంటే సుందరం మనస్సులో ఇదీ అని చెప్పలేని కంగారూ, ఇబ్బందీ కలుగ జొచ్చాయి. 'ఏవిటి వీడి సొద వీడూను—రాణీ మాత్రం?.... మతిలేక పోతే సరి....!.... వాడి కథెందుకు తనకి?....' అనుకుని

"వాడిని పంపించెయ్.... ఊ ...లే.... పోవాం" అని రాణీని హెచ్చరిద్దాం అని ఒకటి రెండు సార్లు కూడా అనుకునీ తర్వాత ఏం ఆలోచించుకున్నాడో ఏమో ఏం అనకుండా ఊరుకున్నాడు మండపం మీద పులీ-మేకా ఇంకా ఆడుతూనే ఉన్నారు వాళ్ళెవరో. వాళ్ళ సోమరి తనానికి చిహ్నంగా వాళ్ళ సైకిళ్ళు రెండూ మరింత తుప్పు పట్టినట్లు కనిపించాయి రాణీకి. ప్రేమలేఖ రాస్తూన్న అమ్మాయికేసి సుదరం చూస్తున్నాడేమో అనే అనుమానం మధ్యలో వచ్చి, ఇటు తిరిగి చూసింది రాణీ. లేదని నమ్మకం కుదిరాక సంతృప్తితో కుర్రాడికేసి తిరిగి "ఊ....చెప్పరా...." అన్నది.

"రోజూ ఇలా జరుగుతోందండి. ఓ రోజున మా అయ్యగారు నన్ను రహస్యంగా పిలిచి, అమ్మగారితో కలిసి మద్దేల మనింటికి ఎవరేనా వస్తున్నారురా అని అడిగారండి. కొత్త అయ్యగారెవరో వస్తున్నారని చెప్పానండి. అంతే-మర్నాడు మా అయ్యగారు ఆఫీసుకి వెళ్ళినట్టే వెళ్ళి మళ్ళీ తిరిగి వెంటనే వచ్చేసి గుప్‌చుప్‌గా ఇంట్లో ఓ మూలగదిలో కెళ్ళి పడుకున్నారు. అమ్మగారేమో మామూలుగా మద్దేల కొత్తయ్యగారితో కలిసివచ్చి నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ నన్ను బజారుకి ఎల్లమని డబ్బులిచ్చి పంపారండి. నేను తిరిగి వచ్చేసరికి కొత్తయ్యగారు గబగబా గేటుదాటి వెళ్ళి పోతున్నారు. మా అయ్యగారేమో కోపంతో మండి పోతూ వరండాలో నుంచో పెట్టి అమ్మగారినేమొ ఫెడేల్ ఫెడేల్‌మని దవళ్ళు వాచిపోయేలా చెంప దెబ్బలు కొట్టేస్తున్నా

రండి! నేను భయపడిపోయి కట్టెలా గేటుకి కరుచుకుపోయి ఉండిపోయానండీ.... అయ్యగారు 'పో... నీకు నాకూ సంబంధం లేదు' అంటూ అమ్మగారిని ఇలా బయటికి తోసి అలా గడియేసి లోపలికెళ్ళ బోయారండి. అప్పుడు....అలా అరు ఎలుతూండగానేనండీ...." అంటూ ఆ ఐస్‌క్రీమ్ కుర్రాడు బావురుమని ఏడ్చేశాడు.

రాణీ కళవళపడింది.

న్యూస్‌పేపరు వెనక మొహం చాటేసిన సుందరం కూడా తొట్రుపడ్డాడు.

వాడినెలా సముదాయించాలో తెలియక "ఊరుకో ఏడవకు" అంది రాణీ బాధగా. తన కంఠం తనకే వింతగా వినిపించింది. వాడి బాధ చూస్తే తనకెందుకు బాధ? తన గొంతు నొప్పిపెట్టి తనకి కళ్లనీళ్లు వస్తున్నాయెందుకు? "ఊరుకోరా... ఊరుకో" అంది రాణీ, తన కన్నీళ్లు వాడికి కనిపించకుండా ముఖం పక్కకి తిప్పుకుంటూ.

ఐస్‌క్రీమ్ కుర్రాడు చొక్కాతో కళ్లు తుడుచుకుని మళ్లీ ప్రారంభించాడు. "నేనల్లా గేటుకి కరుచుకునే ఉండిపోయా నండి. అమాంతం అమ్మగారు రివ్వుమంటూ నా మీదకి వచ్చిపడి, దభీదభీమని నా వీపు విరిగిపోయేలా కొట్టేయ సాగారు. 'కొట్టకండి అమ్మగారూ' అని నేనేడుస్తున్నా విన లేదు. తలుపేసుకుని లోపలికి వెళ్ళబోతూన్న అయ్యగారు

దభీలుమని తలుపు తీసుకుని ఇవతలకి వచ్చారు. కాని ఇంతలో 'నిన్ను కొట్టాలా చీరెయ్యాలా? అయ్యగారు ఇంట్లో ఉన్నారని నాకు చెప్పావుకావేం? వెధవా నిన్నూ.... నిన్నూ' అంటూ నా కుడిచెయ్యి దొరక పుచ్చుకుని, పేణం పోయేలా తిప్పేశారండి అమ్మా.... పేణం పోలేదు - కాని చేతి నరాలు పెళపెళా ఇరిగిపోయాయి. నా చెయ్యి ఇరిగి పోయింది. అమ్మగారు నా చెయ్యి విరిచేశారు...." అంటూ వాడు మళ్లీ బావురుమన్నాడు.

ఈ మాట రాణీతోపాటు సుందరం కళ్ళు కూడా చెమర్చాయి.

"తర్వాత నాకేమయిందో తెలియదు. కట్టు కట్టి వున్న మొండి చెయ్యి చూసేసరికి, నా చెయ్యి మోచెయ్యి దాకా తీసేశారని అమ్మ చెప్పేసరికి, గుండెల్లోంచి ఏడుపూ పెద్ద బెంగా వచ్చేసి ఆ రోజల్లా ఏడ్చేశాను. అయ్యగారు ఆసుపత్రి కర్చు పెట్టుకుని వంద రూపాయలు ఇచ్చారని ఆ తర్వాత అమ్మ ఈ ఐస్‌క్రీమ్ ఫ్లెస్క్ కొనిచ్చి నా మొండి చేతికి తగిలిస్తూ చెప్పింది....అప్పటి నుంచీ ఇలా ఐస్‌క్రీములు అమ్ముకుంటూ...."

వాడి కథ వినేసరికి రాణీ కడుపులో ఎవరో చెయ్యిపెట్టి కలిచివేసినట్లయింది. పైటతో కళ్ళు వొత్తుకొని వేనిటీబేగ్ లోంచి రెండు రూపాయలు తియ్యబోయి, అయిదు రూపా

యలు నోటు తీసి వాడి చేతిలో పెట్టి, అప్రయత్నంగా వాడి తలను ఆప్యాయంగా నిమిరింది.

అంత గొప్పింటి మనిషి అమ్మలా తనని నిమిరేసరికి, ఆ కుర్రాడి ఒళ్ళంతా ఒక్కసారి పులకించిపోయి ఆనందం పట్టలేక "అమ్మగారూ... " అన్నాడు.

'ఏఁరా ఏవిటీ?" అంది రాణీ బాధతో కూడిన చిరునవ్వుతో.

"నన్ను మీతో తీసికెళ్తారా? నాకు చదువుకోవాలని వుంది. అదిగో ఆ కారులో వచ్చిన అబ్బాయిల్లాగ నేను కూడా చదువుకుంటానండీ.... చదివిస్తారా?....చెయ్యి లేకపోయినా ఎడం చేత్తో రాస్తానండీ....ఏం? .... అమ్మగారూ? ....నన్ను తీసుకెళ్తారా మీతో" అన్నాడు వాడు పట్టలేని ఆనందోత్సాహాలతో.

"పోనీ అలాగే....తీసుకెళ్దామాండీ?" అంటూ నవ్వుతూ రాణీ సుందరం కేసి చూసింది.

సుందరం విసుగ్గా పేపరు నేలకేసి కొట్టివేస్తూ "మతి లేకపోతే సరి!" అన్నాడు,

అంతే....! ఐస్క్రీమ్ కుర్రాడు ఒక్కక్షణం విస్తుబోయి సుందరం కేసి ప్రాణం లేని కట్టెలాచూసి, వెంటనే భయంతో ఒక్క పిచ్చి అరుపు అరిచి, ఫ్లాస్క్ తీసుకుని, పెద్దపులిని చూసినట్లు అదే పారిపోవడం పారిపోయాడు.

దాదాపు మతిపోయి, రాణీ ఇటు సుందరాన్నీ అటు ఐస్‌క్రీమ్ కుర్రాణ్ణీ మార్చి మార్చి చూస్తూ నిలబడి పోయింది.

"ఊఁ....ఇంక నడు వినడం అయిందా...? వాడి నింకా ఇంటికి తీసుకొచ్చి చదువు చెప్పిద్దాం అనుకున్నావు.... చూశావా ఎల్లా పారిపోయాడో? ఇల్లూ, ఇంటి జీవితం నచ్చు తుందా? బ్రతుకులు! పబ్లిక్‌గార్డెన్ బ్రతుకులూ అని...." అన్నాడు సుందరం.

"ఎవరివి?" అని ప్రశ్నించింది రాణీ.

సుందరం త్రుళ్ళిపడ్డాడు!

(వనిత)